స్వచ్ఛత 'మరుగు'న!

- పట్టణ శివారు, మురికివాడల్లో మరుగుదొడ్లు లేక అవస్థలు
- నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ముందుకుసాగని వైనం
- ఆరుబయట మల, మూత్ర విసర్జనలతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆదోనికి తగ్గిన ర్యాంకు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శివారు, మురికివాడల్లో మరుగుదొడ్లు లేక మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగకపోడంతో ప్రజలు బహిరంగ ప్రాంతాల్లోనే అవసరాలు తీర్చుకుంటున్నారు. రాత్రిపూట విష పురుగులు సంచారంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బహిర్భూమికి వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపాలిటీకి ర్యాంకు తగ్గడానికి ఆరు బయట మల, మూత్ర విసర్జనలు చేయడమే ప్రధాన కారణం.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నిధుల మంజూరు

ఆదోని పురపాలక సంఘంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 2లక్షలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో అక్కడక్కడ సామూహిక మరుగుదొడ్లు ఉన్నప్పటికీ శివారు ప్రాంతాలు, మురికివాడల్లో సరిగా లేవు. దీంతో కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, నాయకులు అయా వార్డులకు వెళ్లినపుడు మరుగుదొడ్లు నిర్మాణాలను చేపట్టాలని మొరపెట్టుకున్నారు. దీంతో అధికారులు కూడా స్పందించి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రెండు నెలల క్రితం రూ.90 లక్షల నిధులను మంజూరు చేసింది. నిధులైయితే విడుదల చేశారు కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

ఆరు వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళిక

పట్టణంలోని ఆరు వార్డుల్లో ఆరు చోట్ల పది సీట్లు చొప్పున మరుగుదొడ్లు నిర్మించాలని ప్రణాళికను సిద్ధం చేశారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.11.70 లక్షలను ఖర్చు చేయనున్నారు. పట్టణంలోని అరుణ్ జ్యోతినగర్, వాల్మీకీ నగర్, ప్రశాంత్ నగర్, రాయనగర్, అమరావతి నగర్ వంటి ప్రాంతాల్లో నిర్మించాలని నిర్ణయించారు. అయితే అమరావతి నగర్‌లో మాత్రమే నిర్మాణాలకు సన్నాహాలు చేశారు. మిగిలిన నాలుగు చోట్ల స్థల సమస్యలతో పనులు ముందుకు సాగడం లేదు.

ఇళ్ల మధ్యలో నిర్మాణానికి అభ్యంతరాలు..

కొంత మంది ఇళ్ల మధ్యలో వద్దని ప్రజలు అభ్యంతరం తెలుపుతున్నారు, మరుగుదొడ్ల నిర్మాణం జరిగితే కష్టాలు దూరమవుతాయని మరి కొంత మంది ఆలోచిస్తున్నారు. నిర్మాణానికి స్థలం కావాలి. అయా కాలనీల ప్రజలు సహకరిస్తే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. నివాసాలకు దూరంగా, అందరికీ అనువైన చోట స్థలాలను చూడాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు అధికారులు అలాంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఒక వేళ పనులు చేపట్టక పోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది.


ఎమ్మిగనూరు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ టాయిలెట్లు

ఆరంభానికి నోచుకోని గ్రీన్ టాయిలెట్

పట్టణంలో బంగారు బజారు, పురపాలక రహదారి, పండిత్ నెహ్రూ రహదారుల్లో వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. అయితే అయా ప్రాంతాల్లో సాముహిక మరుగు దొడ్లు లేక వ్యాపారులు, కనుగోలుదారులు, అయా ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు మరుగుదొడ్లు లేక అత్యవసరమైతే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయా ప్రాంతాల్లో మరుగు దొడ్లు నిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పురపాలక రహదారిలో ఆక్రమణలో ఓ స్థలాన్ని ఇటీవల ఖాళీ చేయించారు. అయినా అక్కడ నేటికీ మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టలేదు. ఎమ్మిగనూరు రహదారిలో గ్రీన్ టాయిలెట్ నిర్మాణం చేపట్టారు. అయితే నేటికీ ఆరంభానికి నోచుకోవడం లేదు. వీటి నిర్మాణాల కోసం రూ. లక్షల్లో ఖర్చు చేశారు. దీంతో ప్రజలు బహిరంగగానే మూత్ర విసర్జన చేస్తున్నారు.

పనులు చేపడతాం

పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో ఉన్న గ్రీన్ టాయిలెట్‌ను ఆరంభించడానికి చర్యలు తీసుకుంటాం. స్థానికంగా కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తాం. మరుగు దొడ్ల నిర్మాణాలకు స్థానిక సమస్యలతో పాటు స్థల సమస్యలు కూడా ఉన్నాయి. వాటిని పరిష్కరించి నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ, పురపాలక కమిషనర్

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

వలస వెళ్లొద్దు

నందవరం: వలసలు నివారణకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కూలీలకు ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంపాండ్ పనులను పరిశీలించారు. మస్టర్లలో హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు తమ గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తున్నామని వలసలు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ మేట్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థిని

ఎమ్మిగనూరుటౌన్: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలవుతారని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్‌రెడ్డి, సుధాకర్‌రావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో రోటరీ క్లబ్, రావూస్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఇందులో భాగంగా నిర్వాహకులు, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ వైద్యులు శ్రీనివాసరెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ మాచాని నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సిగ్నల్ ఇవ్వకుండానే కదిలిన రైలు

ఆదోని సెంట్రల్: రాయచూర్–గుంతకల్ ప్యాసింజర్ రైలు సిగ్నల్ ఇవ్వకుండానే ముందుకు కదిలిన ఘటన శనివారం ఇస్వీ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఉదయం రాయచూర్ నుంచి గుంతకల్‌కు బయలుదేరిన ప్యాసింజర్ రైలు ఇస్వీ స్టేషన్‌లో నిలిచింది. అయితే రైలు ముందుకు వెళ్లడానికి ఎలాంటి సిగ్నల్ వేయకుండానే రైలు ముందుకు కదిలింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే రైలును నిలుపుదల చేశారు. ఈ విషయం ఆదోని స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా.. రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం వలన ఇలా జరిగిందన్నారు. వెంటనే సాంకేతిక లోపాన్ని సరిచేసి రైలును యాథావిధిగా కొనసాగించినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో సిద్ధరూఢ స్వామి రథోత్సవం సందర్భంగా ఆర్ఎస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆదోని వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, గ్రామ పెద్దలు రామలింగారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, బ్లడ్‌గ్రూప్, హెచ్‌బీ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్ఎస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ శివరాముడు, ఇన్‌చార్జ్ పృథ్వి, వైఎస్సార్ సీపీ నాయకులు శివారెడ్డి, బాబురెడ్డి ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.

డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం ప్రకటించనున్న డీఎస్సీలో సమగ్ర శిక్షలో పనిచేసే సీఆర్‌ఎంటీలకు వెయిటేజీ ఇవ్వాలని సీఆర్‌ఎంటీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయకార్యదర్శి పుల్లన్న, జిల్లా అధ్యక్షుడు రంగన్నగౌడ్, రామాంజినేయులు కోరారు. ఈ మేరకు శనివారం మంత్రాలయం వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. రాబోవు డీఎస్సీలో అన్ని అర్హతలున్న సీఆర్‌ఎంటీలకు సంవత్సరానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠంగా 10 మార్కులుఇవ్వాలని కోరారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల : శ్మశానాల్లో పనిచేసే కాటికాపరుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద కేవీపీఎస్, కాటికాపరుల సంఘం నాయకులు శనివారం నిరసన తెలియజేసి తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ మణి మంజరిలకు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, కాటికాపరుల సంఘం మండల నాయకులు కన్నయ్య, తాయప్ప, డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు మారేష్ పాల్గొన్నారు.

భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి

ఎమ్మిగనూరురూరల్: పైలెట్ గ్రామాల్లో భూ రీ సర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిశీలించారు. గ్రామంలో ఎన్ని ఎకరాలు భూమి ఉంది, ప్రభుత్వ భూములు, గ్రామ మ్యాప్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరు, ఇబ్బందుల గూరించి మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న, రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే జరగుతున్న గ్రామాల్లో ముందుగా రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే జరగుతుంది, పొలం దగ్గర ఉండాలని తెలియచేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూ సర్వేను చేపట్టాలని సూచించారు. సర్వేలో ఏమైనా తేడాలు వచ్చినట్‌లైతే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రోవర్ ద్వారా భూమిని కొలిచే విధానాన్ని పరిశీలించారు. సమావేశంలో జిల్లా సర్వేయర్, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మునికన్నన్, తహసీల్దార్ శేషఫణి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

మరో డెంగీ కేసు

పెద్దకడబూరు : మండల పరిధిలోని నౌలుకల్లు గ్రామంలో డెంగీ జ్వరంతో చిన్నారి అక్షయ(7) మృతి చెందిన ఘటన మరవక ముందే మండలంలో మరో డెంగీ కేసు నమోదయ్యింది. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ఆరేళ్ల బాలుడికి బుధవారం జ్వరం రావడంతో ఎమ్మిగనూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ బాలుడిని పరీక్షించిన డాక్టర్లు శుక్రవారం రిపోర్ట్స్‌ను చూసి డెంగీగా నిర్ధారించారు. తక్షణమే చికిత్స ప్రారంభించారు. శనివారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ యూసీ నరసింహులు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కంబదహాల్ గ్రామం సందర్శించి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా.. గ్రామీణ ప్రాంతాలలో డ్రైనేజీలు శుభ్రంగా లేకపోవడం, తాగునీరు కలుషితం కావడం తదితర అజాగ్రత్తల వలననే చిన్నారులు వాధుల బారిన పడుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


డెంగీపై తీసుకోవలసిన జాగ్రత్తల వివరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ యుసీ నరసింహులు

మహిళలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఆదోని డీఎస్పీ ఎం. హేమలత

ఎమ్మిగనూరురూరల్: మహిళలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని ఆదోని డీఎస్పీ ఎం.హేమలత అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కాలేజీ డైరెక్టర్ కె.అనసూయ ఆధ్వర్యంలో ముందస్తు మహిళ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీతో పాటు జెఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ బి.చిత్ర, హోమియర్‌తి, కాస్మటాలజిస్ట్ డాక్టర్ అపర్ణ హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని చెప్పారు. తమ వ్యక్తిత్వ వికాసం ద్వారానే స్వతంత్రులు కాగలరన్నారు. జీవితంలో ఉన్నతస్థాయిలో ఉండాలంటే బాగా చదువుకోవాలని తెలిపారు. అనంతరం కాలేజీ విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు,నాటకాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఫార్మసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎం.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో శనివారం ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్ మాట్లాడుతూ మందకృష్ణ నేతృత్వంలో జరిగిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కాలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, హనుమంతు, మారెన్న, సోమన్న, మునిస్వామి, ఎల్లప్ప, నతానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎస్‌టీ రిజర్వేషన్‌ను సాధించడమే వీఆర్‌పీఎస్ లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర సమితి నాయకులు ఖాశీంనాయుడు, మురళీనాయుడు, బీటీ లక్ష్మన్న, నరసరాజు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం వాల్మీకుల ఎస్‌టీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం వాల్మీకుల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేతో ప్రయోజనం

గోనెగండ్ల : జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎంఎస్‌ఎంఈ సర్వేతో చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల యజమానులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ తెలిపారు. శనివారం ఆమె గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ఎంఎస్‌ఎంఈ సర్వేపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటి వరకు సర్వే ఎంత వరకు పూర్తయ్యిందని, దీనికి పరిశ్రమల వారు సహకరిస్తున్నారా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ మాట్లాడుతూ జిల్లాలో వ్యాపారానికి సంబంధించిన ప్రతి షాపు, పరిశ్రమ ల నుంచి పూర్తిస్థాయిలో వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ సర్వే గతేదాది నవంబర్ 29 నుంచి ప్రారంభం ఇప్పటి వరకు జిల్లాలో 56 శాతం మాత్రమే జరిగిందన్నారు. గోనెగండ్లలో మండలంలో 30శాతం పూర్తయిందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి డానియోల్, గోనెగండ్ల ఈఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ

అన్నివర్గాలను నిరుత్సాహపరిచిన బడ్జెట్


మాట్లాడుతున్న ఫయాజ్‌అహ్మద్

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలను నిరుత్సాహపరిచిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి ప్రజలకు ఆశ చూపిందన్నారు. అయితే ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ హామీలను పూర్తిగా విస్మరించి, సూపర్‌సిక్స్ పథకాల ఊసే లేదన్నారు. ప్రజలు ప్రభుత్వంపై తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక 26వ వార్డులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని ఎల్లంబీడు ప్రాంతంలో ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న మాదుగుండు ఆదెన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం దారుణం

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో చేపట్టాల్సిన సాగునీటి ప్రాజెక్టులైన వేదావతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడికాలువలకు కూటమి సర్కార్ రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నియోజ కవర్గ నాయకుడు భాస్కర్ యాదవ్ ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు ఘనంగా వున్నా కేటాయింపులు మాత్రం శూన్యమని దుయ్యబట్టారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు కేసీ జబ్బార్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ఇస్వీ గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్, గ్రామ సర్పంచ్ శ్యామల, పంచాయతీ కార్యదర్శి గోవిందు పిలుపునిచ్చారు. శనివారం నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇస్వీ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పర్యటించారు. గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు సారా వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సారా తాగడం వల్ల అనారోగ్యాలకు గురవుతారన్నారు. సారా తయారీ, సరఫరా, అమ్మడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సారా వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. ఎవరైనా సారా తయారీకి పాల్పడినా, అమ్మినా.. సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో రమేష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొద్దు

ఆదోని టౌన్: పట్టణంలోని కార్వన్‌పేటలోని హస్మి యా ఉర్దూ మీడియం అప్పర్ ప్రైమరీ పాఠశాల, తెలుగు మీడియం పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయరాదని విద్యుత్‌శాఖ అధి కారులను స్థానిక ప్రజలు, న్యాయవాది సాయికుమార్ కోరారు. శనివారం విద్యుత్‌శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో సుమారు 500 మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నార న్నారు. అటువంటి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు.

పీఓడబ్ల్యూ ఐక్యతా సభను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఒంగోలులోని ఎన్‌జీఓ హాల్‌లో ఈనెల 8న జరిగే రెండు ప్రగతిశీల మహిళా సంఘాల ఐక్యతా సభను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మణి పిలుపునిచ్చారు. శనివారం ఆదోనిలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో విలీన సభ పోస్టర్లను పలువురు మహిళా నాయకురాళ్లతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకురాళ్లు మాదేవమ్మ, చాకలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా గురు భక్తి వైభవోత్సవాలు


కారిడార్ ప్రారంభోత్సవంలో పీఠాధిపతి, మంత్రి నారాలోకేష్


అవార్డు అందుకుంటున్న కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి

మంత్రాలయం: శ్రీమఠంలో రాఘవేంద్రస్వామి గురు భక్తి వైభవోత్సవాలు శనివారం కనుల పండవగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో స్వామివారి పాదుక పట్టాభిషేకం, బంగారు రథయాత్ర నిర్వహించారు. అలాగే పలువురు ప్రముఖులకు అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ప్రదానం చేశారు. అలాగే గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం కారిడార్‌ను ప్రారంభించారు. వేడుకల్లో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ దివ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి సుబ్రమణియన్


కర్ణాటక మైనర్ ఇరిగేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్.ఎస్.బోసేరాజ్

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో శనివారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30గంటలకే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరిగాయి. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలతో పాటు నలంద, నా రాయణ, జీనియస్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొదటి రోజు వె య్యి మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో శనివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ఫస్ట్ ఇయర్ తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 215 మందికి గానూ 187 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరైయ్యారైనట్లు కళాశాల చీఫ్ లక్ష్మీ దేవి తెలిపారు. నారాయణ కళాశాలలో 203 మందికి గానూ 195 మంది హాజరు కాగా 8మంది గైర్హాజరైనట్లు ఆ కళాశాల చీఫ్ దౌలత్ సాబ్ తెలిపారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల జూనియర్ కళాశాలలో మొదటి రోజు తెలుగు పరీక్షకు 267 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 261 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆదోనిలో 2,713 మంది హాజరు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్షలను రాయడానికి అయా సెంటర్లకు తీసుకొచ్చారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి పట్టణంలో 7 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏ,బీ సెంటర్లు, సాయి, బాలాజీ, నారాయణ, అక్షరశ్రీ , ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయా సెంటర్లలో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,783 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 70 మంది గైర్హాజరవ్వగా.. 2,713 మంది పరీక్షలు రాశారు.

అన్నదాన సత్రం ప్రారంభం


అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ పీఠాధిపతులు బసలింగమ్మవ్వ, వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం పంచాయతీ మజరా గ్రామమైన బాపురంలోని గంగా భవాని ఆలయంలో సూమారు రూ. 5లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని ఆలయ పీఠాధిపతులు బసలింగమ్మవ్వ సమక్షంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అదేవిధంగా చిన్నతుంబళం గ్రామంలో రూ. 70వేలతో ఏర్పాటు చేసిన విద్యుత్ పోల్‌లను కూడా ప్రారంభించారు. వై.ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా చిన్నతుంబళం గ్రామంలో వీధులు విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ప్రజా సమస్యలు తీరుస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు యల్లప్ప పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 10న విజయవాడలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ అన్నారు. శనివారం ఆదోనిలోని ఎన్‌జీఓస్ హోంలో సమావేశం నిర్వహించారు. ధర్నాకు భారీగా తరలిరావాలని కోరారు. నాయకులు తిప్పన్న, రామాంజనేయులు, సరోజ, లలిత, గీత, సోమక్క తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు


బహుమతులు అందజేస్తున్న దాతలు

నందవరం: ప్రముఖ గురజాల రామలింగేశ్వరుడి జాతర సందర్భంగా గ్రామంలో రాష్ట్రస్థాయి ఒంగోలు గిత్తల బండలాగుడు పోటీలు జరిగాయి. శనివారం సాయంత్రం ప్రారంభమైన పోటీలో గిత్తలు హోరాహోరీగా పోటీ పడ్డాయి. మొదట స్థానంలో కోడుమూరు మండలం వల్కూరు గ్రామానికి చెందిన దొడ్డికాటి తిరుమలేశు ఎద్దులు రూ.50 వేలు బహుమతిని సొంతం చేసుకున్నారు. రెండో స్థానంలో తెలంగాణ రాష్ట్రం చిన్నబాయి మండలం పెద్దగడ గ్రామానికి చెందిన గోపాల కృష్ణ వృషభాలు రూ.40 వేలు, మూడో స్థానంలో ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామానికి చెందిన దాస్ ఎద్దులు రూ.30వేలు, అలాగే నందవరం గ్రామానికి చెందిన జింకల మేఘనాథ్ వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ.20 నగదు బహుమతులు పొందాయి. ఎద్దుల పోటీలను గ్రామ పెద్దలు శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నరసింహారెడ్డి, గ్రామ సర్పంచు వీరస్వామి, రాజేశ్వరరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు దాతలు వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగయ్యశెట్టి, గార్లదిన్నె శీలన్న ప్రారంభించారు.